

బందోబస్తు మధ్య మండల మీట్

పోలీసుల పహారాలో, ఉత్కంఠ నడుమ గాలివీడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. - 8లో



పోక్సో కేసులో రెండేళ్ల జైలు

మైనర్ బాలిక కిడ్నాప్‌కు సంబంధించి నమోదైన పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష పడింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 53 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	675	675
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 37.080 కిలోలు

న్యూస్‌రీల్

అతిథి గృహాల పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై టూరిజం యూనిట్‌లో అతిథి గృహాల ఆధునీకరణ పనుల్లో తీవ్ర జాప్యంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు స్వయంగా పర్యవేక్షణకు సిద్ధమయ్యారు. సోమ, మంగళవారాలు టూరిజం ఈఈ సుబ్రమణ్యంరాజు హార్సిలీహిల్స్‌పైనే ఉండి పనులు పర్యవేక్షించారు. సత్వరమే పూర్తి చేసి గదులను టూరిజంకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. వారంలోగా కొన్నింటిని అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. మళ్లీ పనులపై పర్యవేక్షించి గదులు అప్పగించేందుకు ఇక్కడికి రానున్నారు. నెలలోగా ఆధునికీకరణ పనులన్నీ పూర్తి చేయించాక, అంతటితో మిగిలిన పనులు నిలిపివేసే అవకాశం కనిపిస్తోంది.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



పరశురాముడు

మదనపల్లె సిటీ : అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు టెక్నికల్ అధికారిగా అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అడ్వైజర్ పరశురాముడు ఎంపికయ్యాడు. ఆయన కర్నూలు జిల్లా వాసి. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నేపాల్ దేశంలో జరిగే రెండవ ఆసియా షూటింగ్ బాల్ పోటీల్లో ఆయన పాల్గొంటారు. ఆయన ఎంపికపై జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి నరేష్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన నియామకం



కె.ఆనందబాబు

పీలేరు రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పీలేరుకు చెందిన కె.ఆనందబాబును నియమిస్తూ తిరుపతి టెలికాం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ సేవలు ప్రజలకు మెరుగ్గా అందించడానికి తనవంతు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు కె.ఆనందబాబు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


సోమశిల జలాల్లోకి చేప పిల్లల విడుదల



చేప పిల్లలు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నందలూరు : మండలంలోని కోనాపురం సోమశిల వెనుక జలాల్లోకి 19 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. మదన మోహనపురం గ్రామ సర్పంచ్ చుక్క నిర్మల, చుక్కా యానాది, ఉప సర్పంచ్ పుల్లయ్య చేతుల మీదుగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మత్స్య క్షేత్రాల నుంచి ఈ చేప పిల్లలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై, వీఆర్‌ఓ శివప్రసాద్, మత్స్యశాఖ అధికారులు వెంకటరమణ, రామమోహన్, సుబ్బనరసయ్య, మోహన్ కృష్ణ, మురళీ, బ్రహ్మానందరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీడ పీడల నిఘా యాప్‌పై అవగాహన



చిట్లూరులో కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రామాపురం : రైతులు జాతీయ చీడ పీడల నిఘా వ్యవస్థ యాప్ గురించి తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి, చిట్లూరు రైతు సేవా కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ యాప్‌పై రైతు సేవా సిబ్బంది రైతులందరికీ తెలియజేయాలని సూచించారు. అనంతరం చిట్లూరు గ్రామంలోని కంది పంటను పరిశీలించి, దిగుబడిని అంచనా వేసి రైతులకు సలహాలు అందించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దయచేసి వినండి.. ఇంటర్‌సిటీ లేదు!

- కుంభమేళాకు రైలు మళ్లింపు
- ప్రత్యామ్నాయం చూపని రైల్వేబోర్డు
- పేదలకు ప్రయాణ కష్టాలు
- పెరిగిన చార్జీల భారం



హుబ్లీ-తిరుపతి మధ్య నడిచే ఇంటర్‌సిటీ ప్యాసింజర్

రాజంపేట : సామాన్యుడి రైలుగా భావించే.. ఇంటర్‌సిటీ రద్దయింది. కుంభమేళాకు మళ్లించడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రాయలసీమ జిల్లాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే కర్ణాటక నుంచి తిరుపతికి వెళ్లే సామాన్య భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సీమ పల్లెల నుంచి తిరుమల కొండకు వెళ్లేందుకు అనుకూలైన రైలు లేకపోవడంతో.. స్వామిని దర్శించుకునేందుకు వెళ్లేదెలా అని వారు ఆందోళన చెందుతున్నారు. రైల్వేబోర్డు, రైల్వే మంత్రిత్వ శాఖ ప్రత్యామ్నాయ రైలును పట్టాలు ఎక్కించకపోవడంతో మండిపడుతున్నారు. తిరుపతి, రేణిగుంట, నందలూరు, కడప మీదుగా వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉండేది. తిరుపతి నుంచి కడప, ఆపై ఎర్రగుంట్ల, ముద్దనూరు, కమలాపురం తదితర ప్రాంతాలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, దినసరి పనికి వెళ్లే కూలీల పరిస్థితి ఈ రైలు రద్దు కావడంతో తల్లకిందులైంది.

బడుగులకు ప్రయాణ కష్టాలు

ప్రయోగరాజ్ కుంభమేళాతో బడుగులకు ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం గుంతకల్ డివిజన్ పరిధిలో నడిచే తిరుపతి -కదిరిదేవరపల్లె-తిరుపతి (57405/06), తిరుపతి-హుబ్లీ-తిరుపతి (57401/02), తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్(57403/08) రైళ్లను గత నెలాఖరు నుంచి రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ రైళ్ల రద్దుతో తిరుపతి, కడప, హుబ్లీ వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చే వారి సమస్య తీవ్రమైంది.

భారీగా చార్జీల భారం

తక్కువ డబ్బుతో ప్రయాణం చేసే వారికి చార్జీల భారం పడింది. రైలు కన్నా ఇతర వాహనాల్లో భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. రైలులో రూ.50 కాగా.. ఇతర వాహనాల్లో దాదాపు రూ.300 అవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నా.. లేనట్టే..!

ఉదయం తిరుపతి నుంచి కడప, కమలాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్లకు వెళ్లేందుకు రైలు ఇప్పుడు అందుబాటులో లేదు. ఉన్న ఇంటర్‌సిటీ ప్యాసింజర్‌ను రద్దు చేశారు. అయితే రైల్వేబోర్డు ప్రత్యామ్నాయ రైలు వేసే విషయం పట్టించుకోలేదు. తిరుపతి-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉన్నా.. పేద, మధ్యతరగతి ప్రయాణికులకు ఉపయోగపడేది కాదు. అరకోణం-కడప ప్యాసింజర్ రైలు ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలకు అనుకూల సమయంలో లేదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్థానిక ప్రయాణికులకు ఏమాత్రం అనువుగా ఉండవు.

సోమన్నా.. మా పరిస్థితి ఏంటీ?



రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న

కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతికి తక్కువ ధరతో వచ్చే సామాన్య భక్తుల ప్రయాణాలకు బ్రేక్ పడింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్న ఉన్నప్పటికీ.. తిరుమల యాత్రికులను దృష్టిలో ఉంచుకొని ఇంటర్‌సిటీ స్థానంలో ప్రత్యామ్నాయ రైలు వేయకపోవడంపై భక్తులు విమర్శిస్తున్నారు. మంత్రి సోమన్న ఇంటర్‌సిటీ తరహాలో తిరుపతి-హుబ్లీ మధ్య మరో రైలును నడిపించాలని రైల్వే బోర్డును ఆదేశించాలని వారు కోరుతున్నారు.

తక్కువ చార్జీతో వెళ్లే వాళ్లం



తక్కువ చార్జీతో కడపకు వెళ్లే వాళ్లం. ఉదయం బయలుదేరి కడపలో పని చేసుకొని సాయంత్రం అదే రైలులో రాజంపేటకు వచ్చే వాళ్లం. ఇంటర్‌సిటీలో రాజంపేట నుంచి కడపకు చార్జీ రూ.15 మాత్రమే. అదే ఆర్టీసీ బస్సు పల్లె వెలుగులో రూ.60, ఎక్స్‌ప్రెస్‌లో రూ.70 చార్జీ పడుతోంది. ఇంటర్‌సిటీ మాలాంటి వారి ప్రయాణానికి సౌకర్యంగా ఉండేది. ఆ స్థానంలో మరో రైలు వేయడం రైల్వే అధికారులు మరిచారు.

– జానీ, ఉస్మాన్‌నగర్, రాజంపేట

ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీలు తక్కువ



ఇంటర్‌సిటీ రద్దు సరే.. మరి ఆ స్థానంలో మరో రైలు వేయడం మరిచారు. రైల్వేఅధికారులు పేదలకు అందుబాటులో ఉండే రైళ్లను రద్దు చేసి, ఇబ్బందులు పెడుతున్నారు. మోదీ పాలనలో పేదలకు రైలు ఎక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాలంటే జనరల్ బోగీలు పెద్దగా లేవు. ప్యాసింజర్‌లో వెళ్దామంటే దాన్ని రద్దు చేశారు.

– సొంబత్తిన శ్రీనివాసులు, బలిజపల్లె, రాజంపేట

1న సీఎం చంద్రబాబు రాక

– జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గంలో ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారని, కావున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ హాలు నుంచి జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1న రాయచోటి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక పింఛన్ల పంపిణీతో పాటు ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సామూహిక గృహ ప్రవేశాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణాల లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. ఈ సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ఆర్డీఓ శ్రీనివాసులు, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు వెంకటరత్నం, సత్యనారాయణ, శివయ్య, సర్వే శాఖ ఏడీ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

సంబేపల్లె : ఫిబ్రవరి 1న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంబేపల్లె మండల పర్యటన సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ బుధవారం రాత్రి అధికారులతో చర్చించారు. సంబేపల్లె మండల కేంద్రంలో సమావేశ వేదిక, పింఛన్ల పంపిణీ ప్రదేశం, ఎన్టీఆర్ నూతన విగ్రహ ప్రారంభం ప్రాంతాలను మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డిలతో కలెక్టర్ కలిసి పరిశీలించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మృతదేహాన్ని సందర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప

పీలేరు : టీడీపీ నాయకుడి దాడిలో మృతి చెందిన చిత్తూరు జిల్లా సదుం మండలం నడిగడ్డ మాదిగ పల్లెకు చెందిన రమణయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్న రమణయ్య మృతదేహాన్ని మాజీ మంత్రి సందర్శించి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాడులు హద్దుమీరిపోయాయన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వాస్పత్రి వద్ద వివిధ దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నిందితున్ని తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఎ.టి.రత్నశేఖర్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

1 నుంచి కడప బాలోత్సవం

కడప కల్చరల్ : ఫిబ్రవరి 1, 2 తేదీలలో కడప బాలోత్సవం నిర్వహించేందుకు జిల్లా రచయితలు, మేధావులు ఏర్పాట్లు చేశారు. గతేడాది ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రెండో ఏడాది మరిన్ని కార్యక్రమాలు, పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులకు కడప నగరం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీని చివరి గడువుగా నిర్ణయించారు. కార్యక్రమానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 5–8 వేల మంది హాజరు అవుతారని నిర్వాహకుల అంచనా. పోటీలను 3 నుంచి 10వ తరగతి వరకు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్‌లుగా మూడు విభాగాలలో నిర్వహిస్తారు.

తొలి రోజు పోటీలు

ఫిబ్రవరి 1న శనివారం... సైన్స్ ప్రదర్శన, మట్టితో బొమ్మలు చేయడం, వ్యాసరచన, కథా రచన, కథా పఠనం, వార్తా పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్లు గీయడం, మెమొరీ టెస్ట్, శాస్త్రీయ, జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, ఫాన్సీడ్రెస్, తెలుగులో ఏకపాత్రాభినయం, తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ రైమ్స్ ఉంటాయి.

రెండవ రోజు ఆదివారం...

చిత్రలేఖనం, వక్తృత్వం, తెలుగు డిక్టేషన్, మ్యాప్ పాయింటింగ్, కోలాటం, జానపద నృత్యం, లఘు నాటికలు ఉంటాయి. మొదటి రోజు పోటీలు ముగిసిన వెంటనే ఆ రోజుకు సంబంధించిన ప్రోత్సాహక బహుమతులను అప్పుడే అందజేస్తారు. మొత్తం బహుమతులను ఆదివారం అన్ని పోటీలు ముగిసిన తర్వాత ప్రముఖుల ద్వారా అందజేస్తారు. ఇతర వివరాలకు 9490 1340 లేదా 90008 5552 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చు.

కల్లుగీత కులాలకు మద్యం దుకాణాలు

రాయచోటి జగదాంబసెంటర్ : కల్లు గీత కులాల వారికి ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించినట్లు రాయచోటి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పట్టణంలో గౌడ్ సంఘానికి, వీరబల్లి ఈడిగ సంఘానికి కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2 లక్షలు((నాన్ రీఫండబుల్) చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.21,66,667, మండల ప్రాంతానికి రూ.18,33,334 కట్టాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10 గంటలకు షాపులకు లక్కీ డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు. కల్లుగీత ఉప కులాలకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

నేడు గండిలో తలనీలాల టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఏడాది కాలం పాటు భక్తులు మొక్కుబడి కింద చెల్లించుకున్న తలనీలాల సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ హక్కుల కోసం గురువారం ఇ-టెండరు,షీల్డు టెండరు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండర్లు స్థానిక కార్యాలయంలో ఉదయం 10–30 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

టెండర్లలో పాల్గొనే వారు తలనీలాలకు సంబంధించి రూ.25 లక్షలు,కొబ్బరి చిప్పలకు సంబంధించి రూ.3లక్షలు డిపాజిట్టు చెల్లించాలని చెప్పారు. దేవదాయ శాఖ నియమ నిబంధనల మేరకు నిర్వహించే టెండర్లకు ఆసక్తి గలవారు డిపాజిట్లు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

సమరానికి సన్నద్ధం

- కార్యకర్తలతోపాటు కొత్త కార్యవర్గానికి దిశా నిర్దేశం
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ప్రణాళిక
- నేడు రాయచోటిలో వైఎస్సార్‌సీపీ సమావేశం
- ముఖ్య అతిథిగా రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- హాజరు కానున్న జిల్లా నేతలు



సాక్షి రాయచోటి : సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు అనతికాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఎప్పుడూ లేని తరహాలో... ఎన్నడూ చూడని విధంగా పాలనపై పెదవి విరిచే పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నెన్నో హామీలు ఇచ్చిన అధికార పార్టీ పెద్దలు ప్రభుత్వ పగ్గాలు చేపట్టగానే విస్మరించడంపై ప్రజల్లో నిరాశ వ్యక్తమవుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే హామీల అమలుకు శ్రీకారం చుట్టగా.. ఇప్పటి సర్కారు ఆ దిశగా అడుగులు వేయలేదు. దీంతో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ.. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఒకసారి, అంతకుముందు రైతుల కోసం పోరు, అలాగే ప్రభుత్వ పెద్దలకు కనువిప్పు కలగాలని దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలతో జనం బాట పట్టింది. అయితే ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీకి సంబంధించి పలువురికి పదవులు అందజేసి, మరింత ఉధృతంగా పోరును చేపట్టేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో కార్యకర్తలను మరింత కార్యోన్ముఖులను చేసేందుకు గురువారం రాయచోటిలో జిల్లా స్థాయిలో అన్ని పదవులు పొందిన నేతలతోపాటు క్యాడర్‌తో రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం అవుతున్నారు.

ప్రజాగొంతుక కానున్న వైఎస్సార్‌సీపీ

రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ కూటమి సర్కారుపై వెలువెత్తుతున్న ప్రజాగ్రహానికి వైఎస్సార్‌సీపీ గొంతుక కానుంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా.. ఇప్పటికీ హామీల అమలు దిశగా అడుగులు వేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరిస్తోంది. ఈ నేపథ్యంలోనే కార్యకర్తలు, నాయకుల్లో ఒక పక్క పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. మరో వైపు ఎక్కడికక్కడ జిల్లాల్లోనూ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రభుత్వంపై యుద్ధం చేసేందుకు సన్నద్ధమయ్యారు.

ఫంక్షన్ హాలులో సమావేశం

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి గురువారం సాయంత్రం పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రానున్నారు. పట్టణంలోని చిత్తూరు రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న పీడీఆర్ కన్వెన్షన్‌లో ఆయన సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇటీవల పార్టీ పదవులు పొందిన వారు, ఇతర ప్రజాప్రతినిధులు, క్యాడర్ పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశా నిర్దేశం చేయనున్నారు.

చేతులెత్తేసి.. టార్గెట్లా?

- జగనన్న ఇళ్లపై కూటమి వైఖరి పట్ల విస్మయం
- మార్చి తర్వాత బిల్లులు చెల్లించబోమన్న ప్రభుత్వం
- 2026 మార్చికి 28,294 ఇళ్ల పూర్తికి లక్ష్యం
- దీనికి వారానికోసారి సమీక్షలు చేయాలట
- పనితీరు కనబరచని అధికారులపై చర్యలకు సిద్ధం



బి.కొత్తకోట : మార్చితో కేంద్రం ఇచ్చే నిధులు ఆగిపోతాయి, తర్వాత ఇళ్లను పేదలే సొంతంగా నిర్మించుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఉత్తర్వు జారీ చేయగా.. అదే ఉత్తర్వులో ఇళ్ల నిర్మాణాలపై ఇచ్చిన లక్ష్యాలను చూసిన ఆ శాఖ వర్గాలు విస్తుపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించే విషయంలో లబ్ధిదారులను ఎలా ఒప్పించాలి, ఎలా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలో అర్థంకాక తల పట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పనితీరు కనబరచని అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఉత్తర్వులో పేర్కొనడంపై అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలను మంజూరు చేశారు. ఈ ఇళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచి సౌకర్యాలు కల్పించడమేకాక ఒక్కో ఇంటికి తిరిగి చెల్లించే అవసరం లేకుండా రూ.1.80 లక్షలు మంజూరు చేశారు.

28,294 ఇళ్లు పూర్తి చేయించాలట

మార్చి తర్వాత నిర్మించుకునే ఇళ్లకు బిల్లులు చెల్లించనప్పుడు, లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేయించాలో అర్థంకాక అధికారులు ఆలోచిస్తుంటే.. 2026 మార్చి నాటికి జిల్లాలో 28,294 గృహాలను పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ జారీ చేసిన ఆదేశాలతో అధికారులు ఉలిక్కి పడుతున్నారు. ప్రస్తుత జనవరి–మార్చి మధ్యలో 6,223 గృహాలు, ఏప్రిల్–జూన్ మధ్య 9,566, జూలై–సెప్టెంబర్ మధ్య 1,286, అక్టోబర్–డిసెంబర్ మధ్య 9,607.. 2026 జనవరి–మార్చి మధ్య 1,612 గృహాల నిర్మాణాలు పూర్తి చేయించాలని అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఇళ్లను పూర్తి చేయాలంటే కోట్లలో బిల్లులు చెల్లించాలి. ఇప్పటి అధికారిక ఆదేశాల మేరకు మార్చి తర్వాత బిల్లులు ఉండవు. ఇలాగైతే లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు రాకపోవచ్చు. ఇదే జరిగితే అధికారులు వారిని ఒప్పించి పనులు పూర్తి చేయించడం అసాధ్యం.

నిరంతర సమీక్షలు

ఇళ్ల లక్ష్యాలను పూర్తి చేయించడం కోసం అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహించాలని గృహ నిర్మాణ శాఖ ఆదేశాలిచ్చింది. అందులో పంచాయతీ, మండల స్థాయిలో అధికారులు సమావేశాలు నిర్వహించాలి. కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, హౌసింగ్ అధికారులు వారానికోసారి సమావేశాలు నిర్వహించి సమీక్షించుకుని పనులు పూర్తి చేయించాలి. ఈ లక్ష్యాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పనితీరు లేని అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖ బిల్లులు ఇవ్వబోమని చెబుతూనే నిర్మాణాలు పూర్తి చేయించాలని చెబుతున్న దృష్ట్యా.. ముమ్ముందు ఎలాంటి పరిస్థితి నెలకొంటుందో చూడాలి.

క్లుప్తంగా

భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్ర స్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధుల్లో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పూజలు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

2న పెంచుపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం



దండు శేఖర్‌రెడ్డి

మదనపల్లె : మండలంలోని పెంచుపాడులో ఫిబ్రవరి 2, ఆదివారం దండు చారిటబుల్ ట్రస్ట్ సహాయ సహకారాలతో, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఐ దండు శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెంచుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్యశిబిరం ప్రారంభమవుతుందన్నారు. పెంచుపాడు, సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు శాంతమ్మ, దండు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో వైఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎరికరెడ్డి వీరారెడ్డి కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. బాధితుడి కథనం మేరకు.. వీరారెడ్డికి చెందిన హోండా ఎక్స్‌ట్రా కారును తన ఇంటి వద్ద పెట్టుకున్నాడు. శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బుధవారం పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాఘ మాసం.. మంచి తరుణం

- నేటి నుంచి జిల్లా అంతటా వివాహాల సందడి
- పురోహితులు, వివిధ కళాకారులకు డిమాండ్





రాజంపేట టౌన్ : మాఘమాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. మాఘమాసం ఆరంభం నుంచే ముహూర్తాలను మోసుకురావడంతో కల్యాణ వేదికలు ముస్తాబయ్యాయి. ఈ ఏడాది మాఘ మాసం ఆరంభం రోజు నుంచే వివాహాల సందడి ప్రారంభం కానుంది. ఈనెల 31వ తేదీ జిల్లాలో అనేక జంటలు ఒక్కటి కానున్నాయి. అందువల్ల 30వ తేదీ వివాహ రిసెప్షన్‌లు ఉన్న కారణంగా జిల్లా అంతటా గురువారం నుంచే సందడి వాతావరణం నెలకొననుంది. వివాహాలతో పాటు గృహప్రవేశాలు, ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు, అన్నప్రాసన, ఉపనయనం వంటి శుభకార్యాలకు అనేక మంది ప్రజలు ముహూర్తాలను కూడా ఖరారు చేసుకున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్

గత రెండు, మూడు నెలలుగా వివాహాలు కుదిరిన జంటలకు తల్లిదండ్రులు మాఘమాసంలో వివాహాలను జరిపిస్తున్నారు. అందువల్ల అనేక మంది ముందుగానే కల్యాణ మండపాలను బుక్ చేసుకోవడంతో వాటికి డిమాండ్ నెలకొంది. కల్యాణ మండపాలు దొరకని వారు తమ ఇళ్లవద్ద, విశాలమైన ఖాళీ స్థలాల్లో వివాహాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జోరుగా అనుబంధ వ్యాపారాలు

వివాహాలు, శుభకార్యాల సీజన్ ప్రారంభం కానుండటంతో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా దుస్తులు, బంగారు, అలంకరణ వస్తువులు, శుభకార్యాలకు అవసరమయ్యే సామగ్రి, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. శుభకార్యాలు ముగిశాక దగ్గరి బంధువులు కొద్ది రోజుల పాటు శుభకార్యాలు జరుపుకున్న వారి ఇంటిలో ఉండనున్నందున నిత్యావసర వస్తువుల వ్యాపారం కూడా ఊపందుకుంది.

స్టేటస్ కోసం.. తగ్గేదేలే

ప్రస్తుతం ధనవంతులు తమ పిల్లలకు జరిపే వివాహాలు వారి స్టేటస్‌కు సింబల్‌గా మారాయి. ఆర్థిక పరిపుష్టిగల వారు వివాహాల కోసం ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా ప్రతిదీ గ్రాండ్‌గా ఉండేలా చూసుకుంటున్నారు. వివాహ సమయంలో డెకరేషన్, విందు కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అలాగే అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీయించేందుకు కూడా లక్షల్లో ఖర్చు చేస్తున్నవారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వివాహ విందులో పసందైన వంటలు ఉండేందుకు పేరెన్నికగన్న క్యాటరింగ్ సంస్థలతో అల్పాహారం, భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది వివాహానికి వచ్చిన వారికి విలువైన గిఫ్టులు కూడా ఇస్తున్నారు.

అనేక మందికి ఉపాధి

వివాహాలు, శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులకు, డెకరేషన్, మంగళ, బ్యాండు వాయిద్య కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్స్ (ఆర్కెస్ట్రా), క్యాటరింగ్, బ్యూటీపార్లర్ నిర్వాహకులకు, ట్రావెల్స్ ఏజెన్సీలకు మెండుగా డిమాండ్ ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించడంతో శుభకార్యాలు వారి ఉపాధికి దోహదపడుతున్నాయి.

కరెంట్‌షాక్‌తో యువకుడికి గాయాలు

మదనపల్లె : కరెంట్ షాక్‌తో యువకుడు గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. చంద్రమాకులపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు రెడ్డివరుణ్(17) బుధవారం ఇంటిలో ట్యాంకుకు నీరుపట్టేందుకు మోటార్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్నాడు.

కుమార్తెతో పాటు మహిళ అదృశ్యం

కలికిరి : కుమార్తెతో పాటు మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. కలికిరి పట్టణం టి.బి.రోడ్డుకు చెందిన షేక్ సర్దార్ భార్య షేక్ మొబుసిరా, మూడేళ్ల కుమార్తె షేక్ జకియా ఫాతిమా ఇద్దరూ వారం రోజుల ముందు ఇంటి నుంచి వెళ్లారు. భర్త, తండ్రి, మామ అందరూ కలిసి బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా మహిళ, ఆమె కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో మహిళ భర్త షేక్ సర్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారును ఢీకొన్న కంటైనర్

- విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి
- మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన సుబ్రమణ్యం రాజు

ఓబులవారిపల్లె : మంగంపేట చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని జాతీయ రహదారిపై కారును కంటైనర్ ఢీ కొనడంతో సుబ్రమణ్యం రాజు (49) మృతి చెందగా రెడ్డయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడపకు చెందిన సుబ్రమణ్యం రాజు తిరుపతిలో విద్యుత్ శాఖలో యూడీసీగా పని చేస్తున్నారు. తన స్నేహితుడు, రైల్వేకోడూరు సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అనంతరాజుపేట దళితవాడకు చెందిన రెడ్డయ్యతో కలిసి రాజంపేట నుంచి తిరుపతికి కారులో వెళ్తుండగా చెన్నకేశవ స్వామి ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న భారీ కంటైనర్ లారీ ఢీ కొంది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం రాజు అక్కడికక్కడే మృతి చెందగా రెడ్డయ్య మెడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు. ప్రమాద స్థలానికి ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కేజీబీవీల్లో వెట్టిచాకిరిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యార్థుల చేత వెట్టి చాకిరి చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, గర్ల్స్ కన్వీనర్ భవిత మాట్లాడుతూ ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం కేజీబీవీల్లో సోషియల్ ఆడిట్‌లో పలు విషయలు వెలుగులోకి వచ్చాయన్నారు. కేజీబీవీలను డీఈఓ, జీసీడీఓ పర్యవేక్షించకుండా గాలికి వదిలేశారన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నవదీప్, నవ్య, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరాజుపేటలో 591 కల్తీ మద్యం బాటిళ్లు స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట పంచాయతీ, ప్రధాన హైవే వద్ద 591 కల్తీ మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర ఆధ్వర్యంలో సీఐ పుల్లయ్య, నీలకంఠేశ్వర్ రెడ్డిలు దాడులు నిర్వహించి కల్తీ మద్యాన్ని పట్టుకున్నారు. అనంతరాజుపేటకు చెందిన వెంకట నారాయణతోపాటు మరొకరిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ అక్రమ మద్యాన్ని, కల్తీ మద్యాన్ని విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

కోట్లు విలువజేసే స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి కేటాయిస్తారా?

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని అక్కాయపల్లెలో రూ.80కోట్లు విలువ జేసే అత్యంత ఖరీదైన స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయించడం అన్యాయని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా విమర్శించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్కాయపల్లెలో ఆర్‌అండ్‌బి ఈఈ కార్యాలయం, న్యాక్ సెంటర్ ఉన్న ప్రాంతంలో టీడీపీ ఆఫీసుకు 2.00 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ ఇవ్వడం దారుణమన్నారు.

ప్రజలను మోసగించడంలో సీఎం చంద్రబాబు దిట్ట

వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఒంటిమిట్టలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల్లో ప్రభుత్వంపై ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనని రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదు, సంపద సృష్టించిన తరువాత ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తానని, ఇప్పుడున్న నిధులను సంక్షేమానికి వాడదలుచుకోలేదని చంద్రబాబు ప్రజలకు నేరుగా చెప్పారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వడం ఇష్టంలేక, ఆర్థిక పరిస్థితి బాగాలేదు అంటూ మోసపూరిత మాటలు మాట్లాడుతూ చేతకాని ముఖ్యమంత్రిగా నిలిచిపోయారని ఆయన ధ్వజమెత్తారు. సమావేశం అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకేపాటి శివారెడ్డి చిన్న కుమారుడు సంవత్సరికం కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి శివారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష



పోక్సో కేసులో శిక్ష పడిన నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె : మైనర్ బాలిక కిడ్నాప్‌కు సంబంధించి నమోదైన పోక్సో కేసులో బుధవారం ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ చిత్తూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.శాంతి తీర్పు చెప్పారు. మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మాయాబజార్‌వీధిలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 26న మైనర్ బాలిక కిడ్నాప్ జరిగింది. దీనిపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన చంద్రశేఖర్ కుమారుడు కోటకొండ చరణ్, తిరుపతి పట్టణానికి చెందిన ఇబ్రహీం కుమారుడు షేక్ హేమద్‌లపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 53/2022, పోక్సో నంబర్.33/2022 కింద కేసు నమోదు చేశారు. ఎస్.ఐ. చంద్రమోహన్ కేసు దర్యాప్తును కొనసాగించి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. చిత్తూరు జిల్లా పోక్సో కోర్టులో బుధవారం నిందితులు ఇద్దరు నేరం చేసినట్లు రుజువు కావడంతో న్యాయమూర్తి ఎన్.శాంతి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ముద్దాయిలకు శిక్ష పడేలా కేసును వాదించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, సీఐ కె.రామచంద్ర, ఎస్‌ఐలు చంద్రమోహన్, ఎస్.కే. రహీముల్లా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ హరిబాబునాయక్, చిత్తూరు కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ టి.సి. సాయిసుధాకర్‌ను అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అభినందించారు. మహిళలు, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడేవారికి పోక్సో కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని ఎస్పీ పేర్కొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ జల్లా పద్మావతమ్మ



సమావేశం వద్ద ఏర్పాటు చేసిన భారీ బందోబస్తు

గాలివీడు : పోలీసుల పహారాలో ఉత్కంఠ నడుమ గాలివీడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ జవహర్ బాబు ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభమైంది. తొలుత అన్యాయంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిన ఎంపీడీఓ జవహర్ బాబును తక్షణమే బదిలీ చేయాలని సభ్యులు తీర్మాణించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ఎంపీడీఓ జవహర్‌బాబు ఏ ప్రాంతంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టినా వివాదాస్పదంగా వ్యవహరించడం పరిపాటిగా మారిపోయిందని ఆరోపించారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులతో చర్చించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయరన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం కొన్ని రోజుల తరువాత ఒప్పందాలు కుదుర్చుకుని కేసుల్లో రాజీ కావడం అలవాటుగా మారిపోయిందన్నారు.

సమస్యలపై చర్చ..

అభివృద్ధి, ప్రజా సమస్యలపై సభ్యులు ప్రశ్నించగా శాఖల వారిగా అధికారులు సమాధానమిచ్చారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వాటర్ షెడ్, ఫారెస్ట్, ఎక్సైజ్, ఆర్టీసీ శాఖల అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. నూతనంగా మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఏర్పాటుకు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి ప్రతిపాదించగా సభ్యులు మద్దతు పలికారు.

ముందస్తు భద్రతా చర్యలు..

గాలివీడు మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు, 17 మంది సర్పంచులు ఉండగా అందులో ఒక సర్పంచ్, ముగ్గురు ఎంపీటీసీలు టీడీపీ వారు కాగా మిగిలిన సభ్యులందరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో సమావేశంలో గొడవలు జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు, గత నెల 27 వ తేదీన ఎంపీడీఓపై జరిగిన దాడి దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 100 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు డ్రోన్ వీడియో కెమెరాలతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ సమావేశంలో తహసీల్దార్ భాగ్యలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ క్రెడిట్‌తో ఉన్నత విద్యా ప్రమాణాలు

యూజీసీ డైరెక్టర్ నరసింహులు



నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహులు

కురబలకోట : కాలానికి అనుగుణంగా జాతీయ స్థాయిలో ఒకే విద్యా విధానం ఉండాలన్న ఆలోచనతో ఉన్నత విద్యా సంస్థలలో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ ఆవిష్కరించడం జరిగిందని హైదరాబాదు యూనివర్సిటీ యూజీసీ హ్యూమన్ రిసోర్సు డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై. నరసింహులు పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో మార్కుల స్థానంలో క్రెడిట్స్ ఇస్తారన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. క్రెడిట్స్ ఆధారంగానే విద్యార్థి స్థాయిని నిర్ధారిస్తారన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు.

ఏపీఎండీసీ పాఠశాల ఉద్యోగుల తొలగింపు అభివృద్ధా?



ఏపీఎండీసీ పాఠశాల ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

ఓబులవారిపల్లె : మూడేళ్లుగా ఏపీఎండీసీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధా అని కోడూరు అభివృద్ధి పోరాట కమిటీ కన్వీనర్ పి.జాన్ ప్రసాద్ ప్రశ్నించారు. మంగంపేట ఏపీఎండీసీ పాఠశాల ఎదురుగా నాన్ టీచింగ్ స్టాఫ్ మూడో రోజు రిలే నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన కుటుంబాల వారు నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారన్నారు. వారికి రావాల్సిన మూడు నెలల జీతం అడిగినందుకు విధులనుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. ఏపీఎండీసీ ఎండీ వెంటనే స్పందించి తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న పీఠాధిపతి



కోదండరాముని సన్నిధిలో పీఠాధిపతి

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని బుధవారం బెంగళూరుకు చెందిన ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామీజి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఆయనను సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కారు సహా రూ.5 లక్షల శ్రీగంధం స్వాధీనం



కారుతోపాటు శ్రీగంధం స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

పీలేరు : కారుతోపాటు రూ. 5 లక్షల విలువైన శ్రీగంధం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు వద్ద మంగళవారం రాత్రి నుంచి ఫారెస్ట్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పీలేరు నుంచి చిత్తూరు వైపు వేగంగా వెళుతున్న కారును ఆపే ప్రయత్నం చేశారు. అయితే వాహనాన్ని వేగంగా తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపి డ్రైవర్ చీకటిలో పారిపోయాడు. వాహనాన్ని తనిఖీ చేయగా 43 కేజీల బరువుగల శ్రీగంధం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్, నందీశ్వర్, సురేష్‌రాజు, సుబ్రమణ్యం, చరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

లింగాల : లింగాల ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి బుధవారం ఇద్దరు వీఆర్‌ఓలు, ఇద్దరు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అయితే నోటీసులు అందుకున్న వారు సమగ్ర భూసర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నామన్నారు. నోటీసుల విషయాన్ని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ హేమలత దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ ఈశ్వరయ్యతో చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన రుషిమణి(17) అనే యువతి అదృశ్యమైంది. ఈమేరకు ఆమె తండ్రి మునెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. చిలంకూరు గ్రామానికి చెందిన రుషిమణి చిలంకూరు గ్రామంలో ఉన్న జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 27వ తేదీన కళాశాలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రాలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం యువతి తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాజంపేట 3వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్. ప్రవీణ్ కుమార్



కడప అర్బన్: రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్. ప్రవీణ్‌కుమార్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కడపలో పని చేస్తున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలమ్ పెట్టించడం తదితర ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఫీల్డు అసిస్టెంట్ హత్యను ఖండిస్తూ ఉపాధి సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ సిబ్బంది

దువ్వూరు(చాపాడు): కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డు అసిస్టెంట్ హత్యను ఖండిస్తూ బుధవారం దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే సిబ్బంది నిరసన తెలిపారు. కర్నూలు జిల్లాలో ఫీల్డు అసిస్టెంటు హత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకు గురైన ఫీల్డు అసిస్టెంట్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ వసంత కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.